ఇక మస్తు మజా!

టీ20 వరల్డ్ కప్‌లో సూపర్-8 బెర్తులు ఖరారు

నేటితో ముగియనున్న గ్రూప్ దశ • రెండు గ్రూపులుగా విడిపోనున్న జట్లు

ఈనెల 2 నుంచి క్రికెట్ అభిమానులను అలరిస్తున్న టీ20 వరల్డ్ కప్‌లో ఒక అంకం ముగిసింది! మంగళవారం వెస్టిండీస్-అఫ్గానిస్థాన్ మ్యాచ్‌తో ఈ టోర్నీలో గ్రూప్ దశకు తెరపడనుంది. ఇప్పటికే సూపర్-8 బెర్తులను ఖరారు చేసుకున్న 8 జట్లు.. రెండు గ్రూపులుగా విడిపోయి అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఒక్కో గ్రూపులో 4 జట్లు.. 3 మ్యాచ్‌లు ఆడనుండగా పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన రెండు జట్లు సెమీస్‌కు చేరతాయి.

అంటిగ్వా: మునుపెన్నడూ లేని విధంగా అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తొలి సారిగా 20 జట్లతో వెస్టిండీస్/అమెరికా సంయుక్త వేదికలుగా నిర్వహిస్తున్న టీ20 వరల్డ్ కప్‌లో గ్రూప్ దశకు మంగళవారంతో శుభం కార్డు పడనుంది. సోమవారం బంగ్లాదేశ్.. నేపాల్‌ను ఓడించడంతో పాటు శ్రీలంక నెదర్లాండ్స్‌ను చిత్తు చేయడంతో బంగ్లా తదుపరి రౌండ్‌కు అర్హత సాధించడంతో సూపర్-8 బెర్తులు ఖరారయ్యాయి. దీంతో నేడు వెస్టిండీస్-అఫ్గానిస్థాన్ మధ్య జరిగే పోరు నామమాత్రమే. బుధవారం నుంచి ఈ టోర్నీలో సూపర్-8 పోరుకు తెరలేవనుంది. గ్రూప్ దశను విజయవంతంగా దాటిన 8 జట్లు రెండు గ్రూపులుగా విడిపోయాయి. గ్రూప్-1లో భారత్, ఆస్ట్రేలియా, అఫ్గానిస్థాన్, బంగ్లాదేశ్ ఉండగా గ్రూప్-2 లో ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్, యూఎస్ఏ ఉన్నాయి. ఈ దశలో ఒక జట్టు తమ గ్రూపులో ఉన్న మిగిలిన మూడు జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడుతుంది. పాయింట్ల పట్టికలో అగ్రస్థానాన నిలిచిన రెండు జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి.

ప్రతి మ్యాచ్ సవాలే!

ఇకనుంచి ప్రతి జట్టుకూ ఆడబోయే ప్రతి మ్యాచ్ సవాలే కానుంది. పసికూనలు ఇచ్చిన షాకులు, కరేబియన్ గడ్డపై పిచ్‌లు స్పందిస్తున్న తీరును చూస్తే ఇకనుంచి టోర్నీ మరింత రసవత్తరంగా సాగడం ఖాయంగా కనిపిస్తోంది. గ్రూప్ దశలో పలు మ్యాచ్‌లకు అమెరికా ఆతిథ్యమిచ్చినా సూపర్-8తో పాటు సెమీస్, ఫైనల్స్ విండీస్ లోనే జరుగుతాయి.

భారత్ ఎవరెవరితో?

సూపర్-8లో భారత్ కఠినమైన సవాళ్లనే ఎదుర్కోవాల్సి ఉంది. ఈనెల 20న అఫ్గాన్‌తో ఆడనున్న రోహిత్ సేన.. 22న బంగ్లాతో, 24న ఆస్ట్రేలియాతో తలపడుతుంది. గ్రూప్ దశలో అఫ్గాన్‌తో ఆడిన ఏ ప్రత్యర్థి కూడా మూడంకెల స్కోరు చేయలేదు.భారత ఐసీసీ ట్రోఫీ కలకు 'అడ్డుకట్ట' వేస్తున్న కంగారూలు మరోసారి కంగారు పెట్టేందుకూ సిద్ధమవుతున్న నేపథ్యంలో 'మెన్ ఇన్ బ్లూ' ఈ గండాన్ని ఎలా దాటుతుందనేది ఆసక్తికరం.

గ్రూప్-1:	భారత్, ఆస్ట్రేలియా, అఫ్గాన్థిన్, బంగ్లాదేశ్
గ్రూప్-2:	ఇంగ్లండ్, సౌతాఫ్రికా, వెస్టిండీస్, యూఎస్ఏ

బంగ్లా ముందుకు.. డచ్ ఇంటికి

నెదర్లాండ్స్‌కు నిరాశ

ఘనవిజయంతో ముగించిన లంక

కింగ్స్‌టౌన్ (సెయింట్ విన్సెంట్): సూపర్-8 చేరాలంటే తప్పక నెగ్గాల్సిన మ్యాచ్‌లో బ్యాట్‌తో విఫలమైనా బంతితో ఆకట్టుకున్న బంగ్లాదేశ్.. తమ ఆఖరి లీగ్ పోరును విజయంతో ముగించింది. నేపాల్‌పై 21 పరుగుల తేడాతో గెలిచి తదుపరి దశకు అర్హత సాధించింది. ఈ టోర్నీలో ముందంజ వేయాలంటే భారీ విజయం సాధించాల్సిన దశలో నెదర్లాండ్స్.. శ్రీలంక చేతిలో చిత్తుగా ఓడటం బంగ్లాదేశ్‌కు కలిసొచ్చింది. సోమవారం కింగ్స్‌టన్ వేదికగా నేపాల్‌తో జరిగిన గ్రూప్ డీ మ్యాచ్‌లో బంగ్లాదేశ్.. మొదట బ్యాటింగ్ చేస్తూ 19.3 ఓవర్లలో 106 పరుగులకే చేతులెత్తేసింది. నేపాల్ బౌలర్లు కట్టడి చేయడంతో బంగ్లా జట్టులో ఒక్కరైనా రెండంకెల స్కోరు చేయలేకపోయారు. షకిబ్ అల్ హసన్ (17) టాప్ స్కోరర్. నేపాల్ బౌలర్లలో సోంపల్ (2/10), లమిచానె (2/17), పౌడెల్ (2/20) రాణించారు. గత మ్యాచ్‌లో సౌతాఫ్రికాతో ఒక్క పరుగు తేడాతో ఓడిన నేపాల్ ఈ మ్యాచ్‌లోనూ విజయానికి చేరువగా వచ్చింది. కానీ బౌలింగ్‌కు అనుకూలించిన పిచ్‌పై బంగ్లా బౌలర్, 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' తాంజిమ్ హసన్ సకిబ్ (4/7) నిప్పులు చెరగగా ముస్తాఫిజుర్ రెహ్మాన్ (3/7) విజృంభించడంతో నేపాల్.. 19.2 ఓవర్లలో 85 పరుగులకే ఆలౌట్ అయింది. కుశాల్ (27), దీపేంద్ర (25) పోరాడారు.

లంకకు భారీ విజయం

పొట్టి ప్రపంచకప్‌లో చెత్త ప్రదర్శనలతో తీవ్ర విమర్శలను ఎదుర్కొంటున్న శ్రీలంక తమ ఆఖరి మ్యాచ్‌లో మాత్రం అదిరిపోయే విజయంతో వీడ్కోలు పలికింది. సెయింట్ లూసియా వేదికగా నెదర్లాండ్స్‌తో జరిగిన మ్యాచ్‌లోలంక బ్యాటర్లు ఝూలు విదిల్చారు. కుశాల్ మెండిస్ (46), చరిత్ అసలంక (46), ధనంజయ డిసిల్వ (34) వీర విహారం చేయడంతో ఆ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 201 పరుగులు

అసలంక (46)

చేసింది. అనంతరం ఛేదనలో నెదర్లాండ్స్.. 16.4 ఓవర్లలో 116 పరుగులకే చాపచుట్టేసి 83 పరుగుల తేడాతో ఓడింది. లెవిట్ (31), ఎడ్వర్డ్స్ (31) ఫర్వాలేదనిపించారు. నువాన్ తుషారా (3/24), పతిరాన (2/12) రాణించారు. అసలంకకు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

ఫెర్గూసన్ రికార్డు స్పెల్

కివీస్ ఘనవిజయం

ట్రినిడాడ్: టీ20లలో బౌలర్లు కలలో కూడా ఊహించని విధంగా న్యూజిలాండ్ పేసర్ లాకీ ఫెర్గూసన్ (3/0) రికార్డు స్పెల్‌తో పొట్టి ప్రపంచకప్‌లో న్యూజిలాండ్ తమ ఆఖరి మ్యాచ్‌లో ఘనవిజయం సాధించింది. పపువా న్యూ గినీ (పీఎన్‌జీ)తో జరిగిన పోరులో ఫెర్గూసన్.. 4 ఓవర్లు వేయగా నాలుగూ మెయిడిన్లే కాగా 3 కీలక వికెట్లు తీయడం విశేషం. ఫెర్గూసన్, బౌల్ట్ (2/14), సౌధీ (2/11) ధాటికి పీఎన్‌జీ 19.4 ఓవర్లలో 78 పరుగులకే ఆలౌట్ అయింది. ఛేదనను కివీస్ 12.2 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి పూర్తిచేసింది. డెవాన్ కాన్వే (35) రాణించాడు. ఫెర్గూసన్‌కే 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.

ర్యాంకింగ్స్‌లో నాగల్ జోరు

ఢిల్లీ: భారత టెన్నిస్ సింగిల్స్ ఆశాకిరణం సుమిత్ నాగల్ ఏటీపీ ర్యాంకింగ్స్‌లో ముమ్ముందుకు దూసుకెళ్తున్నాడు. గత వారం కెరీర్ బెస్ట్ (77) ర్యాంకు సాధించిన నాగల్.. తాజాగా పెరుగియా చాలెంజర్ టోర్నీ ఫైనల్ చేరడంతో ఆరు స్థానాలు మెరుగుపరుచుకుని 71వ ర్యాంకుకు చేరాడు. ఇదే అతడికి కెరీర్ బెస్ట్ ర్యాంకు కావడం విశేషం.

స్టిమాక్‌పై వేటు

ఢిల్లీ: భారత ఫుట్‌బాల్ హెడ్ కోచ్ ఇగార్ స్టిమాక్‌పై వేటు పడింది. ఐదేండ్లుగా 'బ్లూ టైగర్స్'కు హెడ్‌కోచ్‌గా ఉన్న స్టిమాక్‌ను ఆ పదవి నుంచి తొలగిస్తున్నట్టు ఆలిండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ (ఏఐఎఫ్ఎఫ్) సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఫిఫా వరల్డ్ కప్ - 2026లో ఆసియా రీజియన్ నుంచి కీలకమైన మూడో రౌండ్‌కు అర్హత సాధించడంలో భారత్ దారుణంగా విఫలమైన నేపథ్యంలో ఏఐఎఫ్ఎఫ్ ఈ నిర్ణయం తీసుకుంది. 'ఫిఫా వరల్డ్ కప్ అర్హత రౌండ్లలో భారత ప్రదర్శన తీవ్రంగా నిరాశపరిచింది. జట్టును గెలుపుబాట పట్టించేందుకు కొత్త కోచ్ అవసరమని సభ్యులంతా ఏకగ్రీవ తీర్మానం చేశారు. స్టిమాక్ పదవీకాలం ముగిసిందని ఉత్తర్వులు జారీ చేశాం.' అని ప్రకటనలో పేర్కొంది.

బ్యాడ్మింటన్ చాంప్ శశాంక్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: యోనెక్స్ సన్‌రైస్ ఆల్ ఇండియా సబ్ జూనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నీలో శశాంక్, దుర్గా ఇషా-కీర్తి మంచాల విజేతలుగా నిలిచారు. మియాపూర్‌లోని చేతన్ ఆనంద్ బ్యాడ్మింటన్ అకాడమీ వేదికగా సోమవారం ముగిసిన ఈ టోర్నీలో అండర్ 15 సింగిల్స్ ఫైనల్లో పుల్లెల గోపిచంద్ బ్యాడ్మింటన్ అకాడమీకి చెందిన శశాంక్.. 21-11, 22-20తో అదే అకాడమీకి చెందిన గిరవాసన్ పై గెలిచి టైటిల్ నెగ్గాడు. అండర్-17 మహిళల డబుల్స్‌లో దుర్గా ఇషా-కీర్తి మంచాల.. 21-16, 21-19తో దీప్క్ రాజ్ అదితి- పొన్నమ్మపై గెలిచారు. అండర్-15లో ప్రశాంత్ షిండే, సూర్యవంశీ రన్నరప్స్‌గా నిలిచారు. పైన పేర్కొన్న షట్లర్లంతా గోపిచంద్ అకాడమీలో శిక్షణ పొందుతున్నవారే కావడం విశేషం. విజేతలను గోపిచంద్, సీనియర్ కోచ్ రాజేందర్, అనిల్, బ్యాడ్మింటన్ సంఘం ప్రతినిధులు అభినందించారు.

అమిత్ షాతో గంభీర్ భేటీ

టీమ్‌ఇండియా కోచ్‌గా ఫిక్స్!

ఢిల్లీ: భారత క్రికెట్ జట్టు మాజీ ఆటగాడు గౌతం గంభీర్ సోమవారం ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీ అయ్యాడు. టీమ్‌ఇండియా హెడ్‌కోచ్ రేసులో గంభీర్ పేరు ప్రముఖంగా వినిపిస్తున్న నేపథ్యంలో గౌతి.. షాతో సమావేశమవడం ప్రాధాన్యత సంతరించుకుంది. వీరి భేటీ అనంతరం గంభీర్ తన ఎక్స్ (ట్విటర్) ఖాతాలో స్పందిస్తూ.. హోంమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి సాధారణ ఎన్నికల్లో గెలిచినందుకు శుభాకాంక్షలు తెలిపానని వెల్లడించాడు. ఇదిలాఉండగా 'మెన్ ఇన్ బ్లూ'కు ప్రధాన కోచ్‌గా గంభీర్ పేరు దాదాపు ఖాయమైనట్టేనని, అధికారిక ప్రకటన మాత్రమే మిగిలున్నదని వార్తలు వినిపిస్తున్నాయి. ఈ మేరకు గంభీర్ పెట్టిన షరతులకు (సహాయక కోచింగ్ సిబ్బంది నియామకంలో పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని) బీసీసీఐ పచ్చజెండా ఊపిందని బోర్డు వర్గాలు తెలిపాయి. ఇందులో భాగంగానే ఐపీఎల్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌కు ఫీల్డింగ్ కోచ్‌గా ఉన్న జాంటీ రోడ్స్‌ను భారత జట్టుకు తీసుకురానున్నట్టు సోమవారం సోషల్ మీడియాలో వార్త వైరల్ అయింది. గంభీర్, రోడ్స్.. రెండేండ్ల పాటు లక్నో జట్టుకు సేవలందించిన విషయం విదితమే.

సాయి కిరణ్‌కు స్వర్ణం

హెప్టథ్లాన్‌లో శ్రీతేజకు కాంస్యం • జాతీయ యూత్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఛత్తీస్‌గఢ్ లోని బిలాస్‌పూర్ వేదికగా జరిగిన 19వ జాతీయ యూత్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ అథ్లెట్లు సత్తా చాటారు. రాష్ట్రానికి చెందిన యువ అథ్లెట్ సాయి కిరణ్ షాట్‌పుట్‌లో స్వర్ణం సాధించగా హెప్టథ్లాన్‌లో మన అమ్మాయి శ్రీతేజ మూడో స్థానంలో నిలిచి కాంస్యం దక్కించుకుంది. పురుషుల షాట్‌పుట్ ఈవెంట్‌లో సాయికిరణ్.. ఇనుపగుండును 18.36 మీటర్లు విసిరి పసిడి దక్కించుకుని రాష్ట్రానికి తొలి పతకాన్ని అందించాడు. ఇక శ్రీతేజ.. 4,136 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. రిని ఖాటూన్ (పశ్చిమబెంగాల్- 4,357), దుర్గాశ్రీ దినేశ్ (తమిళనాడు - 4,158) తొలి రెండు స్థానాల్లో నిలిచారు. తెలంగాణకే చెందిన కేతావత్ సింధు.. 3,680 పాయింట్లతో ఏడో స్థానం దక్కించుకుంది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.